

9న శ్రీరామ విజయ మంత్రం

నరసరావుపేటఈస్ట్: ఇస్సప్పాలెంలోని ఆర్యవైశ్య అన్నదాన సత్ర సముదాయంలో ఈనెల 9వ తేదీన శ్రీరామ మంత్ర జపాన్ని చేపడుతున్నట్లు కన్వీనర్ బత్తుల మురళి తెలిపారు.



తామర పూలతో అభిషేకం

పిడుగురాళ్ల: పట్టణంలోని నాగుల గుడి దేవస్థానంలో సోమవారం పంచమి సందర్భంగా మహా సరస్వతి అమ్మవారికి 1008 తామర పుష్పాలతో పుష్పార్చన చేశారు.



ఘనంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

తాడేపల్లిరూరల్: యర్రబాలెంలో ముత్యాలమ్మ తల్లి, పోతురాజు స్వామి వార్ల విగ్రహ ప్రతిష్టా మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

విజయకీలాద్రిపై గరుడ హోమం



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రం 8వ వార్షికోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉదయం 8.30 గంటలకు ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠ, గరుడ హోమం అంగరంగ వైభవంగా నిర్వహించామని తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు దేవతాహ్వానం, శేష వాహనంపై స్వామిని ఊరేగించామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆయన తెలిపారు.

కనులపండువగా శ్రీ భావనారుషి కల్యాణం



తెనాలి: స్థానిక షరాఫ్‌బజారులోని శ్రీ భద్రావతి సమేత శ్రీభావనాఋషి కల్యాణాన్ని సోమవారం తెల్లవారుజామున వైభవంగా నిర్వహించారు. గత కొద్దిరోజులుగా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. సోమవారం సాయంత్రం పులి వాహనోత్సవం, రాత్రి రాజాధిరాజ మహోత్సవం (రథోత్సవం) జరిపారు. ముందురోజు రాత్రి స్వామికి భృంగీశ్వర వాహనోత్సవం, అమ్మవారికి గజవాహనోత్సవం నిర్వహించారు. ఆయా వేడుకల్లో పద్మశాలీయ బహూత్తమ సంఘం పెద్దలు జొన్నాదుల కృష్ణ సత్యనారాయణ, జొన్నాదుల వెంకట కోటేశ్వరరావు, తాడిపర్తి శివ సత్యనారాయణ వరప్రసాద్, సంఘం గౌరవ అధ్యక్షుడు జొన్నాదుల మహేష్, గౌరవ సలహా సభ్యులు అక్కల శ్రీరామ్, దివి హేమంత్ కుమార్, గుంటి వెంకట్, అధ్యక్షుడు తిరువీధుల సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి పంచుమర్తి భాస్కరరావు, కోశాధికారి గట్టు బాల శ్రీనివాసరావు, ఉత్సవ నిర్వహణ కమిటీ చిన్నం హరిగోపాల్, జొన్నాదుల మదన్‌మోహనరావు, ఆకురాతి శ్రీనివాసరావు, గుంటి ధనలక్ష్మి, తాడిపత్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యార్డుకు 1,20,593 మిర్చి బస్తాలు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,20,593 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,05,330 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,000 నుంచి రూ.14,500 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.9,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.8,500 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 74,044 బస్తాలు నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

సిద్ధమవుతున్న ప్రభలు



నాదెండ్ల: మహాశివరాత్రిని పురస్కరించుకుని కోటప్పకొండ తిరునాళ్లకు తరలించే భారీ ప్రభల పనులు గ్రామాల్లో ప్రారంభమయ్యాయి. మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం, అప్పాపురం గ్రామాల నుంచి ప్రతి ఏడాది కోటప్పకొండకు భారీ విద్యుత్ ప్రభలను తరలించే ఆనవాయితీ ఉంది. నెల రోజుల ముందే ప్రభ పనులు ప్రారంభిస్తారు. ఈ నెల 26న తిరునాళ్ల సందర్భంగా 24వ తేదీన గ్రామాల్లో గ్రామోత్సవం, 25న ప్రభలు బయలుదేరి 26న కోటప్పకొండ సన్నిధికి చేరుకుంటాయి. అనంతరం తిరిగి గ్రామాలకు ప్రభలను తరలించి మరోసారి గ్రామోత్సవం నిర్వహిస్తారు.

పేద రైతుపై దౌర్జన్యకాండ

- ప్రైవేటు సర్వేయర్లతో కొలతలు
- రౌడీలను మోహరించి భయభ్రాంతులకు గురిచేసిన వైనం
- మొక్కజొన్న పంట ధ్వంసం చేసి మార్గం ఏర్పాటు
- బాధిత కుటుంబం గృహ నిర్బంధం
- టీడీపీ నేతకు కొమ్ముకాసిన పోలీసులు



పొక్లెయిన్‌తో పనులు చేయిస్తున్న టీడీపీ నాయకుడు, అనుచరులు

కొల్లూరు: అధికారం అండతో టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. బలహీన వర్గాలకు చెందిన ఓ రైతు ఆరుగాలం కష్టించి సాగుచేసిన పంటను పొక్లెయిన్ ధ్వంసం చేయడమే కాకుండా పొలంలో నుంచి రహదారి నిర్మించారు. పోలీసులు కూడా టీడీపీ నేతలకు బాసటగా నిలిచారు. ఈ సంఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. బాపట్ల జిల్లా జువ్వలపాలెం శివారు గుంటూరుగూడెంలో తాజాగా జువ్వలపాలెంకు చెందిన మారీదు ప్రసాద్, అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, కాంట్రాక్టర్ వేములపల్లి రవి కిరణ్‌లకు పక్కపక్కనే భూములు ఉన్నాయి. రహదారి విషయమై ఇరువురి మధ్య వివాదం ఉంది. ఈనేపథ్యంలో రెండేళ్ల కిందట కొలతలు వేయించేందుకు ఇరువురు సర్వేయర్లను ఏర్పాటు చేసుకున్నారు. కాగితాలు పరిశీలించిన వారు రహదారికి అవకాశం లేదని రవికిరణ్‌కు స్పష్టం చేయడంతో మిన్నకుండిపోయారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో ఆయన తన ప్రయత్నాలను తిరిగి ప్రారంభించారు. ఆదివారం పెద్ద సంఖ్యలో రౌడీలను మోహరించారు. ప్రైవేటు సర్వేయర్లను రంగంలోకి దింపి కొలతలు కొలిపించి హద్దురాళ్లను తొలగించారు. ప్రసాద్ పొలంలో చేతి కందే దశకు వచ్చిన మొక్కజొన్న పంటను పొక్లెయిన్‌తో ధ్వంసం చేయించాడు. తన పొలంలోకి మార్గం ఏర్పాటు చేసుకున్నట్లు బాధితుడు ప్రసాద్ ఆరోపిస్తున్నాడు. విద్యుత్ మోటరు బోరు, సాగునీటి సరఫరా చేసే పరికరాలు ధ్వంసం చేశారు. పత్రాల ప్రకారం కొలతలు కొలిపించుకుందామని బాధిత రైతు ప్రసాద్ పత్రాలను తీసుకువెళ్లాడు. టీడీపీ నాయకు డి అనుయాయులు పత్రాలు లాక్కునేందుకు ప్రయత్నించి దాడి చేశారు. బాధిత కుటుంబ సభ్యులను ఇంటి నుంచి బయటకు రాకుండా నిర్బంధించారు. ఇంటి వద్ద ఓ పోలీసు అధికారిని, సిబ్బందిని కాపలాగా ఉంచారు. పంట, విద్యుత్ మోటరు, నీటి సరఫరా సామాగ్రి ధ్వంసం చేయడంతో సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

పోలీసుల తీరుపై విమర్శలు

భూ హద్దుల వివాదం విషయంలో జోక్యం చేసుకోరాదని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నప్పటికీ స్థానిక అధికారులు టీడీపీ నాయకుడికి కొమ్ముకాయడం వివాదాస్పదంగా మారింది. పోలీసు అధికారులు, సిబ్బంది పొలం వద్ద మోహరించి మొక్కజొన్న పంట ధ్వంసం చేస్తున్నా మౌనంగా ఉండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కోర్టు అనుమతితో కేసు నమోదు

భూ వివాదం సమయంలో దాడికి గురైన బాధిత రైతు మారీదు ప్రసాద్ వైద్యశాలలో ఇచ్చిన ఫిర్యాదు అందింది. ఈ వ్యవహారంపై కేసు నమోదు విషయంలో కోర్టు అనుమతి తీసుకోవాల్సి ఉంది. భూమి పత్రాలలో జువ్వలపాలెంకు చెందిన రైతుకు 2 సెంట్లకు లింక్ డాక్యుమెంట్లతో పాటు హక్కు పత్రాలు ఉన్నట్లు మా పరిశీలనలో వెల్లడైంది. అయితే ప్రైవేట సర్వేయర్లతో కొలతలు కొలిపించుకునే విషయం మాకు ప్రమేయం లేదు.

– జి. ఏడుకొండలు, ఎస్‌ఐ, కొల్లూరు



మొక్కజొన్న పంటను ధ్వంసం చేసి నిర్మించిన మార్గం



ధ్వంసం చేసిన సాగునీటి విద్యుత్ మోటరు, నీటి సరఫరా పరికరాలు

వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై టీడీపీ వర్గీయుల దాడి

- ధాన్యం తరలించే సమయంలో చెలరేగిన వివాదం
- దాడిలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు వ్యక్తులు
- చికిత్స నిమిత్తం చీరాల వైద్యశాలకు తరలింపు
- దాడికి పాల్పడిన టీడీపీ రౌడీ మూకలు



దాడిలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరెడ్డి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుబ్బరామిరెడ్డి

చినగంజాం: పొలంలో పండిన ధాన్యాన్ని బస్తాల్లో పట్టి టైరు బండ్లకు ఎత్తి తరలిస్తున్న సందర్భంలో ఇద్దరి మధ్య తలెత్తిన చిన్నపాటి వివాదం టీడీపీ వర్గీయుల జోక్యంతో రాజకీయ రంగు పులుముకుంది. పరస్పర దాడులకు పురి కొల్పింది. బాధితుల కథనం... చినగంజాం మండలం మున్నంవారిపాలెం పంచాయతీ పరిధిలోని ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ సమీపంలో నివాసముంటున్న వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు ఆట్ల సుబ్బరామిరెడ్డి, ఆట్ల శ్రీనివాసరెడ్డి, టీడీపీ వర్గీయుడు కోకి పవన్‌కుమార్‌రెడ్డి అలియాస్ భీమారెడ్డి సోమవారం ఉదయం 7గంటలకు పొలంలో పండిన ధాన్యాన్ని బస్తాలకు ఎత్తి టైరుబండ్లతో తీసుకొచ్చేందుకు పొలం దగ్గరకు వెళ్లారు. అమీన్‌నగర్‌కు చెందిన జాలయ్య పొలంలో పండిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆట్ల బాబులురెడ్డి అనే మధ్యవర్తి ద్వారా సుబ్బరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, భీమారెడ్డి, అవినాష్‌రెడ్డిలతో కలిపి ఆరు టైరుబండ్లు మాట్లాడి ధాన్యాన్ని తరలించేందుకు వారిని పొలానికి పంపాడు. రెండు రోజుల క్రితం సుబ్బరామిరెడ్డి, భీమారెడ్డిల మధ్య టైరుబండి తోలే విషయంలో జరిగిన ఘర్షణ నేపథ్యంలో సోమవారం ఉదయం మళ్లీ గొడవ పడ్డారు. ఆ సమయంలో భీమారెడ్డి.. సుబ్బరామిరెడ్డి తన తొడపై కొరికి గాయపరచాడనే సాకుతో కర్రతో తలపై గట్టిగా మోది గాయపరిచాడు. అంతటితో ఆగక రాజు బంగారుపాలేనికి చెందిన టీడీపీ గ్రామ అధ్యక్షుడు, అతనికి బంధువు అయిన కోకి భాస్కరరెడ్డికి ఫోన్‌చేసి విషయం చెప్పి ఘటనా స్థలానికి రావాలని పిలిచాడు. భాస్కరరెడ్డి తన సోదరులు, కుమారు లు, గ్రామస్తులు సుమారు 15 మందిని వెంటపెట్టుకొని వచ్చి సుబ్బరామిరెడ్డి, అతని వెంట ఉన్నవారిపై దాడి చేశారు. వారిలో తలకు తీవ్ర గాయాలపాలైన సుబ్బరామిరెడ్డిని చీరాల వైద్యశాలకు తరలించారు. మరికొద్దిసేపటికి వారితో పాటు ఉన్న ఆట్ల శ్రీనివాసరెడ్డి టైరు బండి తోలుకుంటూ ఇంటికి వస్తుండగా కోకి భీమారెడ్డి ఇంటి దగ్గర అతని సోదరుడు రామిరెడ్డి ఆపి ఘ ర్షణకు దిగాడు. శ్రీనివాసరెడ్డిపై పదునైన చెక్క తో దాడి చేయడంతో అతని ఎడమ చేయికి గా యమైంది. శ్రీనివాసరెడ్డినీ చికిత్స నిమిత్తం చీరా ల వైద్యశాలకు తరలించారు. చీరాల ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదుచేసుకొని చినగంజాం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

కూటమి ఎత్తులు.. జిత్తులు

- నిబంధనలకు నీళ్లొదిలిన అధికారులు
- ఏకపక్షంగా సాగిన ఎన్నికల ప్రక్రియ
- భారీగా మోహరించిన తెలుగుదేశం శ్రేణులు
- ఇది పూర్తిగా అప్రజాస్వామికం : మేయర్, డిప్యూటీ మేయర్ ఆరోపణ

అధికారం అండతో స్థాయీ సంఘం కైవసం



గుంటూరు నగరపాలక సంస్థకు బస్సులో వస్తున్న వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరిన కార్పొరేటర్లు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/ నెహ్రూనగర్ : అధికారం అండతో కూటమి రెచ్చిపోయింది. పోలీసులు, మున్సిపల్ అధికారులు, ఎమ్మెల్యేల అండతో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో స్థాయీ సంఘం ఎన్నికల్లో గెలుపొందారు. అత్యంత నాటకీయ పరిణామాల మధ్య సోమవారం ఈ ఎన్నికలు జరిగాయి. ఇరువర్గాలు క్యాంపు నుంచి నేరుగా తమ కార్పొరేటర్లను మున్సిపల్ కార్యాలయం వద్దకు తీసుకువచ్చాయి. కూటమి నేతలు మున్సిపల్ అధికారులతో కుమ్మక్కు అయ్యారు. అభ్యర్థులను భయాందోళనలకు గురిచేసేలా ప్రతి బ్యాలెట్‌పై సీరియల్ నంబర్ వేసి ఎవరు ఎవరికి ఓటు వేశారో తెలిసేలా చేశారు. స్థాయి సంఘం ఎన్నిక పూర్తిగా సీక్రెట్ బ్యాలెట్‌లో జరగాల్సి ఉండగా దీనికి భిన్నంగా గుంటూరు మున్సిపల్ అదనపు కమిషనర్ వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై వైఎస్సార్‌సీపీ సభ్యులు అభ్యంతరాలు పెట్టినా అధికారులు బేఖాతరు చేశారు.

ఆరుగురు గెలుపు

ఎన్నికల పోటీల్లో నిలబడిన ఆరుగురు కూటమి సభ్యులు(5 టీడీపీ, 1 జనసేన) గెలిచారు.స్థాయి సంఘం ఎన్నిక ఉదయం 10.30గంటలకు ప్రారంభమైంది. మధ్యాహ్నం రెండు గంటలలోపు మొత్తం 56 మంది సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 3 గంటల తరువాత కౌంటింగ్ ఫలితాలు కమిషనర్ పులి శ్రీనివాసులు వెల్లడించారు.

పశువుల మాదిరి కొనుగోలు

2021లో జరిగిన కార్పొరేటర్ల ఎన్నికల్లో కూటమి నేతలు 11 మాత్రమే గెలిచారు. మిగిలిన 44 డివిజన్లలో వైఎస్సార్ సీపీ గెలిచింది. 2021 నుంచి ఇప్పటి వరకు మూడుసార్లు వైఎస్సార్‌సీపీ శ్రేణులే స్థాయీ సంఘం కమిటీ సభ్యులుగా గెలుస్తూ వచ్చారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారం కోల్పోవడంతో సంతలో పశువుల మాదిరి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రి కొన్ని లక్షలు ఖర్చు పెట్టి కొనుగోలు చేశారు. గత మూడు సార్లుగా ఎప్పుడో బరిలో ఉండని కూటమి నేతలు సోమవారం జరిగిన 4వ స్థాయీ సంఘం ఎన్నికకు పోటీ చేశారు. అయితే, మొత్తం 18 మంది బలం మాత్రమే ఉండగా ఈ వారం రోజుల్లో కొనుగోళ్లకు తెరలేపారు. చివరికి కూటమి తరపున పోటీ చేసిన అభ్యర్థులకు 31 నుంచి 33 ఓట్లు వరకూ వచ్చాయి. దీనిని బట్టి చూస్తే ఎన్నిక కోసం ఎన్ని కుట్రలు పన్నారో స్పష్టంగా అర్థమవుతుంది. ఒకరి ఓటు చెల్లకుండా పోయింది.

భారీగా మోహరించిన టీడీపీ శ్రేణులు

నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం వద్దకు ఉదయం 10.30గంటల నుంచే టీడీపీ, జనసేన కూటమి నేతలు భారీగా చేరుకున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ఓ కాలేజీకి చెందిన విద్యార్థులను కూడా కార్పొరేషన్ కార్యాలయం వద్దకు తీసుకువచ్చారు. ఎలాగైనా హడావుడి చేసి భయాందోళన సృష్టించేందుకు కుయుక్తులు పన్నారు టీడీపీ శ్రేణులు. ప్రధాన కార్యాలయంలోకి కార్పొరేటర్లు, మీడియా వారినే అనుమతించాల్సి ఉండగా..టీడీపీ శ్రేణులను కూడా లోపలకి అనుమతించి హడావుడి చేయించారు. అధికారం ఉందనే అహంతో ఏదైనా సాగుతుందని తమ దర్పాన్ని ప్రదర్శించారు టీడీపీ శ్రేణులు. పోటీ చేసిన ఆరుగురు కూటమి సభ్యులు గెలుపొందడంతో బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.



గుంటూరు నగరపాలక సంస్థ వద్ద పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కార్పొరేటర్ల ఇంటికి వెళ్లి కొనుగోలు : మేయర్ కావటి

స్థాయీ సంఘాన్ని ఎలాగైన దక్కించుకోవాలనే ఉద్దేశంతో టీడీపీ ఎమ్మెల్యేలు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల ఇంటింటికి వెళ్లి వారిని సంతలో పశువులను కొన్నట్లు కోనుగోలు చేశారని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు పేర్కొన్నారు. 15 సంవత్సరాలుగా కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవం ఉన్న నాకు...ఎప్పుడు కూడా స్థాయీ సంఘానికి ఇంత రాద్ధాంతం చూసిన దాఖలాలు లేవన్నారు. కక్కిన కూడుకి ఆశపడినట్లు టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ సభ్యులను కొనుగోలు చేయడం సిగ్గుచేటని ఖండించారు. స్థాయీ సంఘాన్ని టీడీపీ కైవసం చేసుకునే విధంగా అధికారులు వ్యవహరించారని ఆరోపించారు. ఇందుకు ఉదాహరణ ఓటర్ కౌంటర్ స్లిప్ పైన, సభ్యులకు ఇచ్చే స్లిప్ పైన సీరియల్ నంబర్ ఉందని తెలిపారు. దీనిని బట్టి చూస్తే అర్థం అవుతుందన్నారు. ఈ ఎన్నిక అప్రజాస్వామ్యబద్ధంగా జరిగిందడానికి రుజువుగా పేర్కొన్నారు. అసలు సీరియల్ నంబర్లు ఇవ్వాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు.

ఎన్నిక అప్రజాస్వామికం : డెప్యూటీ మేయర్

స్థాయి సంఘం ఎన్నికకు అధికారులు ఇంత హడావుడి చేయడం చరిత్రలో ఎప్పుడ జరగలేదని డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు పేర్కొన్నారు. 56 మంది ఉన్న సభ్యులకు వందల సంఖ్యలో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారంటనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని తెలిపారు. అధికార పార్టీ తన అధికారాన్ని అడ్డంపెట్టుకుని అధికారుల సహకారంతో ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికను అపహాస్యం చేశారని మండిపడ్డారు.

అధికారం అడ్డు పెట్టుకుని గెలుపు : ఎమ్మెల్సీ చంద్రగిరి

స్థాయి సంఘం ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందాలనే లక్ష్యంతో టీడీపీ శ్రేణులు లక్షలు ఖర్చు పెట్టి కార్పొరేటర్లను కొన్నారని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం ఆరోపించారు. అధికారులను అడ్డం పెట్టుకుని స్థాయీ సంఘంలో గెలిచారన్నారు. కార్పొరేటర్‌లను కొనుగోలు చేయడం దారుణం.

కనుల పండువగా కార్తికేయుని కల్యాణం



మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవిలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దివ్య కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి కనుల పండువగా జరిగింది. వేలాదిగా హాజరైన భక్తులు స్వామివారి కల్యాణ వేడుకను కనులారా తిలకించి పులకించారు. తొలుత ఆలయం వెలుపల భక్తుల సమక్షంలో ఎదురుకోలు ఉత్సవం జరిగింది. వేదపండితులు, దేవదాయశాఖ అధికారులు రెండు వర్గాలుగా స్వామివారు, అమ్మవార్ల పక్షాన వాదప్రతివాదనలు చేశారు. చలోక్తుల మధ్య ఈ ఉత్సవం ఆసక్తికరంగా నిర్వహించారు. అనంతరం అమ్మవార్లను వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలతో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ మండపం వద్దకు తోడ్కొని వచ్చారు. ఫ్లడ్ లైట్లు వెలుగుల మధ్య స్వామివారి కల్యాణం దేదీప్యమానంగా కొనసాగింది. అనంతరం వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణ వేడుకను జరిపించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం పోటెత్తింది.

ఉదయం ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో వేదపండితుడు కొమ్మూరి ఫణికుమార్ శర్మ, ఆలయ ప్రధానార్చకుడు బుద్దు పవన్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన వంటి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ ఆధ్వర్యంలో ఎస్‌ఐ సత్యనారాయణ పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శేషవాహనంపై కార్తికేయుని గ్రామోత్సవం

స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి శేషవాహనంపై సోమవారం గ్రామోత్సవం నిర్వహించారు. అంతకుముందు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో వేదపండితులు కొమ్మూరి ఫణికుమార్ శర్మ, ఆలయ ప్రధానార్చకుడు బుద్దు పవన్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో ఉదయం ఐదు గంటలకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, పంచామృత స్నపన, నిత్యహోమం, బలిహరణ, నీరాజన మంత్రపుష్పాలతో పూజలు చేశారు. అనంతరం స్వామివార్లను ప్రత్యేక పల్లకీలో ఆలయ ప్రదక్షిణ నిర్వహించిన అనంతరం శేషవాహనంపై ఉభయ దేవేరులతో రావివారిపాలెం వరకు ఊరేగింపు జరిగింది. ఆలయ ప్రాంగణలో గురువు ఆదిశేషు ఏర్పాటు చేసిన మురళీకోలాటం భక్తులను అలరించింది.

రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

పట్నంబజారు: రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ చెప్పారు. ప్రజలకు రహదారి భద్రత గురించి, ట్రాఫిక్ నియమాల గురించి తెలియపరచడంలో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీ ఎం. రమేష్, ట్రాఫిక్ సీఐలు సింగయ్య, ఏ. అశోక్ ఆధ్వర్యంలో సోమవారం చుట్టుగుంట సెంటర్‌లో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌ను ప్రారంభించారు. ట్రాఫిక్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సిగ్నల్స్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. సిస్టమ్ ద్వారా వాహనదారులకు ఎప్పటికప్పుడు ట్రాఫిక్ హెచ్చరికలు, సిగ్నల్ సమాచారం, అత్యవసర డైవర్షన్‌లు, రోడ్డు ప్రమాదాల గురించి తెలియజేయవచ్చని చెప్పారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు వేగంగా స్పందించడానికి అవకాశం ఉంటుందని వివరించారు. మణిపాల్ హాస్పిటల్ నేతృత్వంలో ట్రాఫిక్ పోలీసులకు 200 రేడియం జాకెట్లు అందజేశారు. రానున్న వేసవిలో విధి నిర్వహణకు అవసరమైన టోపీలు, కళ్లజోళ్లు, గ్లూకోజ్, తాగునీటి సదుపాయాలను అందజేస్తామని ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు.



రేడియం జాకెట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ రమేష్

క్లుప్తంగా

దేవతలకు పట్టువస్త్రాలు బహూకరణ



బాపట్ల: పట్టణంలోని శ్రీ అష్టలక్ష్మీ దేవస్థానం 8వ వార్షికోత్సవం సందర్భంగా పలు దేవాలయాలకు పట్టు వస్త్రాలను కమిటీ సభ్యులు సోమవారం అందించారు. నరాలశెట్టివారి పాలెంలోని రామాలయం, పోలేరమ్మ తల్లి దేవాలయం, శ్రీభావన్నారాయణస్వామి దేవాలయం, కన్యకా పరమేశ్వరి దేవాలయంలోని దేవతలకు వస్త్రాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో నరాలశెట్టివారిపాలెం మహిళలు పాల్గొన్నారు.

రేపటి వరకు బీ.ఫార్మసీ, ఫార్మా-డీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్స్

బాపట్ల: ఫార్మసీ కళాశాలల్లో భర్తీ కాకుండా మిగిలిపోయిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు ఈనెల 5వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు ప్రిన్సిపల్ గోపాలకృష్ణమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాజమాన్య కోటా కేటగిరి బి విద్యార్థులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. బాపట్లలో కోటాలో సీట్లు పొందాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

తెనాలి డబుల్ హార్స్ ప్రత్యేక అవుట్‌లెట్లు

తెనాలి: తెనాలి ఆటోనగర్, అనంతపురం జిల్లాలోని తాడిపత్రి, విజయవాడ దగ్గర్లోని గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో డిపార్చర్ బ్లాక్ వద్ద సోమవారం తెనాలి డబుల్‌హార్స్ బ్రాండ్ ప్రత్యేక అవుట్‌లెట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా తెనాలి డబుల్‌హార్స్ గ్రూప్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మునగాల మోహన్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రత్యేక అవుట్‌లెట్ల ద్వారా వినియోగదారులకు నేరుగా ఉత్తమ నాణ్యత కలిగిన ఉత్పత్తులను అందించేందుకు కృషిచేస్తున్నామని చెప్పారు. త్వరలోనే ప్రతి ఇంటికీ అవసరమైన అన్ని ఉత్పత్తులను ఒకేచోట అందించేందుకు 'కంప్లీట్ కిచెన్ బాస్కెట్'ను అందుబాటులోకి తీసుకురానున్నట్టు వెల్లడించారు. ఈ విస్తరణ తెనాలి డబుల్‌హార్స్ గ్రూప్ నాణ్యత, సంప్రదాయం, వినూత్న ఆహార ఉత్పత్తులపై ఉన్న నిబద్ధతను వెల్లడిస్తుందని తెలిపారు. తమను వినియోగదారులకు మరింత చేరువ చేస్తుందని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం

ముగిసిన వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్

బాపట్లటౌన్: క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మూడురోజులుగా జరుగుతున్న వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ సోమవారంతో ముగిసింది. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ క్రీడాకారులు అద్భుతమైన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారన్నారు. ఇదే స్ఫూర్తిని విధి నిర్వహణలో కొనసాగించాలన్నారు. వార్షిక స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. పోలీసు విధి నిర్వహణలో క్షణం తీరిక లేకుండా ఉంటారన్నారు. ఆ సమయంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ లోపిస్తుందన్నారు. స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం వల్ల పని ఒత్తిడితో నలిగిపోతున్న పోలీసు అధికారులు, సిబ్బందికి కొంత ఊరట లభిస్తుందన్నారు. ముఖ్యంగా విధులతో పాటు నిరంతరాయంగా వ్యాయామం చేస్తూ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహిస్తూ, మంచి ఆహారపు అలవాట్లు పాటిస్తూ, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నారు. మంచి ఆరోగ్యంగా ఉంటేనే, విధులను సమర్థంగా నిర్వహించగలమన్నారు. జయాపజయాల గురించి చింతించకుండా, వాటిని సంతోషంగా స్వీకరించాలన్నారు. ఈ స్పోర్ట్స్ మీట్ లో ఓవర్ ఆల్ విజేతగా డిస్ట్రిక్ట్ ఆర్మ్‌డ్ రిజర్వ్ జట్టు నిలిచిందన్నారు. పురుషుల విభాగంలో ఓవర్ ఆల్ విజేతగా ఏఆర్ పీసీ జి.కృష్ణ నిలిచారన్నారు. మహిళల విభాగంలో ఓవర్ ఆల్ విజేతగా డబ్ల్యూపీసీ జి.సునీత నిలిచారన్నారు. ఓవరాల్ రన్నర్స్‌గా చీరాల సబ్ డివిజన్ జట్టు నిలిచిందన్నారు. కబడ్డీ విజేతగా బాపట్ల డివిజన్, రన్నర్‌గా చీరాల సబ్ డివిజన్ జట్టు నిలిచాయి. టగ్ ఆఫ్ వార్ విజేతగా చీరాల సబ్ డివిజన్, రన్నర్స్‌గా ఆర్మ్‌డ్ రిజర్వ్ జట్టులు నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, చీరాల, బాపట్ల, రేపల్లె డీఎస్పీలు మొయిన్, రామాంజనేయులు, శ్రీనివాసరావులు, సీసీఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్, ఏఆర్ డీఎస్పీ విజయసారథి, ట్రైనీ డీఎస్పీ అభిషేక్, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

అంకితభావంతో విధులు నిర్వర్తించినప్పుడే గుర్తింపు

అంకితభావంతో విధులు నిర్వర్తించినప్పుడే గుర్తింపు లభిస్తుందని ఎస్పీ తుషార్‌డూడీ అన్నారు. 2023 బ్యాచ్‌కు చెందిన ట్రైనీ డీఎస్పీ ప్రాక్టికల్ శిక్షణ నిమిత్తం సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన అభిషేక్ అనంతపురం పీటీసీలో శిక్షణ పూర్తిచేసుకున్నారు. జిల్లాలో ఆరు నెలలపాటు ఉండి ప్రాక్టికల్ శిక్షణ పొందనున్నారు. ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు.

రవాణాశాఖ అధికారుల విస్తృత తనిఖీలు

20 స్కూల్ బస్సులపై కేసులు



నరసరావుపేట రూరల్: రావిపాడురోడ్డులో సోమవారం రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన 20 బస్సులపై కేసులు నమోదు చేశారు. ఎంవీఐ ఎం.నాగేశ్వరరావు, ఏఎంవీఐలు శ్రావ్య, సీహెచ్ మనీషా, ఎంఐ వంశీకృష్ణలు తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎంవీఐ శ్రావ్య మాట్లాడుతూ 36వ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. తనిఖీల్లో భాగంగా పరిమితికి మించి విద్యార్థులతో ప్రయాణిస్తున్న బస్సులపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. అలాగే ఫిట్‌నెస్‌తో పాటు ఇతర పత్రాలు పరిశీలించి సరైన పత్రాలు లేని వాహనాలపై కేసులు నమోదు చేసినట్టు వివరించారు.

చేనేతలకు బడ్జెట్‌లో అరకొర

మంగళగిరి (తాడేపల్లి రూరల్) : ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చేనేతలకు అరకొర మాత్రమే నిధులు కేటాయించారని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు విమర్శించారు. మంగళగిరి నగర పరిధిలోని ఏపీ చేనేత కార్మిక సంఘంరాష్ట్ర కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా చేనేత పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి 1.60 కోట్లమంది జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వీరికి కేవలం ముష్టివేసినట్లు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 200 కోట్ల రూపాయలు కేటాయించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభా దామాషా ప్రకారం చూసినా 10 వేల కోట్ల రూపాయలు బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉందని పేర్కొన్నారు. కేవలం ఎన్నికల సమయంలో చేనేతలకు అధిక నిధులు కేటాయిస్తామని, వారి అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పడం తప్పా ఆచరణలో ఎక్కడా అమలు జరగడం లేదని వివర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పునరాలోచించి చేనేతలకు, చేనేత పరిశ్రమలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో చేనేత కుటుంబాలు కేంద్రప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు హెచ్చరించారు. సమావేశంలో ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట కృష్ణారావు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు

13 నుంచి డీటీపీలో ఉచిత శిక్షణ

కొరిటిపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ నుంచి డీటీపీలో, 20వ తేదీ నుంచి టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ జి.బి.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్‌లో 30 రోజులు, డీటీపీలో 45 రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వయస్సు 19 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలని సూచించారు. ఆసక్తి గల వారు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, డీటీపీ కోసం 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ జిరాక్స్ కాపీతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట లేదా, 0863-2336912, 9700687696, 8125397953, 9949930155 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సాంకేతికతను అందిపుచ్చుకుని యువత ముందుకు సాగాలి

- బెక్టాగన్-2025కు అన్ని ఏర్పాట్లు చేపట్టాలి
- ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని

బాపట్ల: సాంకేతికతను అందిపుచ్చుకుని యువత ముందుకుసాగాలని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల్లో ఈనెల 28వ తేది నుంచి మార్చి ఒకటో తేదీ వరకు నిర్వహించే బెక్టాగన్ వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ముప్పలనేని మాట్లాడుతూ రాయి రూపంలో ఉండే వజ్రాన్ని సాన పెడితేనే కాంతివంతమై వెలుగులను విరజిమ్ము తుందని తెలిపారు. విద్యార్థులలో నిండి నిమిడీకృతమైన సృజనాత్మకశక్తిని వెలికి తీసి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, అభ్యుదయపదంలో విద్యార్థులు ముందుకు సాగటానికి బెక్టాగన్ ఉపయోగపడుతుందన్నారు. బెక్టాగన్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ డి.నిరంజన్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో టెక్నికల్, కల్చరల్, లిటరరీ, స్పోర్ట్స్ ఈవెంట్స్‌కు సంబంధించిన వివిధ పోటీలను నిర్వహించి మార్చి 1వ తేదీన విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జ్ఞాపికలను, సర్టిఫికెట్లలను అందిస్తామని తెలిపారు. ఐదు లక్షలకు పైగా నగదు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా మార్చి ఒకటో తేది సాయంత్రం అందరినీ అలరించే ప్రత్యేక సంగీత విభావరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు, దొడ్డపనేని వెంకయ్య చౌదరి, ప్రిన్సిపల్ డాక్టరు షేక్ నజీర్, కోటా వీరబ్రహ్మయ్య, విద్యార్థుల విభాగం ఆర్గనైజర్లు కె.శ్రీనివాసకళ్యాణ్, ఆశ్రితప్రియదర్శిని, ఎస్.సుష్మ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



బెక్టాగన్-2025 పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని

చేనేతలను మరోసారి మోసం చేసిన కేంద్రం

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా శివ దుర్గారావు

సత్తెనపల్లి: కేంద్ర బడ్జెట్లో చేనేత కార్మికులను మోదీ ప్రభుత్వం మరొకసారి మోసం చేసిందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా శివ దుర్గారావు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో చేనేత కార్మికుల బతుకులు నానాటికి దిగజారి పోతున్నాయన్నారు. ప్రధాని మోదీ చేనేత రంగానికి సంవత్సరానికి రూ. 5 వేల కోట్లు కేటాయిస్తానని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తొమ్మిది సంవత్సరాలలో చేనేతలకు ఏమీ చేయకుండా మోసం చేశారన్నారు. చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అనుముల వీరబ్రహ్మం, నాయకులు పాల్గొన్నారు.

ధర్మరక్షణ కోసం ధర్మనిధి సభ్యులుగా చేరాలి

సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ హేమశంకరరావు

రేపల్లె రూరల్: ధర్మరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ధర్మనిధి సభ్యులుగా చేరాలని సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు చెప్పారు. పట్టణంలోని ఎస్టీ కాలనీ రామమందిరం వద్ద సోమవారం జరిగిన సమరసత సేవా ఫౌండేషన్ రేపల్లె మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ధర్మనిధి సభ్యత్వాలపై కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించాలన్నారు. గ్రామ సమితిల ద్వారా అన్ని గ్రామాల నుంచి ధర్మనిధి సభ్యత్వాలను తప్పక చేయించాలన్నారు. ఫిబ్రవరి 8వ తేదీన రెండో శనివారాన్ని పురస్కరించుకుని సత్సంగం, 12న మాఘ పౌర్ణమిని పురస్కరంచుకుని సామూహిక హారతులు, 24వ తేది ఏకాదశి రోజున నగర సంకీర్తన కార్యక్రమాలను గ్రామాలలో ఘనంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా పరియోజన ప్రచారక్ పొన్నపల్లి సత్యనారాయణ, సభ్యులు పడమటి వెంకటేశ్వరరావు, పేరం కోటేశ్వరరావు, జంగం శ్యామ్ ప్రసాద్, నంబూరు వేణు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ హేమశంకరరావు

రసవత్తరంగా ఎడ్ల బండలాగుడు పోటీలు

రెండు పళ్ల విభాగంలో మాదల ఎడ్ల జతకు మొదటి బహుమతి

నాదెండ్ల: నాదెండ్ల-గణపవరం డొంకరోడ్డులో కొలువైయున్న శ్రీ నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. సోమవారం నాలుగు పళ్ల విభాగంలో ఏడు జతలు పాల్గొన్నాయి. సెంట్రల్ జీఎస్టీ అండ్ కస్టమ్స్ అధికారి గాదె శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పోటీల్లో పాల్గొన్న పశు యజమానులకు జ్ఞాపికలు అందించారు. ఆదివారం రాత్రి వరకూ జరిగిన రెండు పళ్ల విభాగంలో 11 జతలు పాల్గొన్నాయి. మొదటి బహుమతిని ముప్పాళ్ల మండలం మాదల గ్రామానికి చెందిన జవ్వాజి మేఘనా నాయుడు ఎడ్ల జత 3076 అడుగులు దూరం లాగాయి. రెండోస్థానంలో బెల్లంకొండ మండలం మాసాయపాలెం గ్రామానికి చెందిన గౌరు కార్తికేయ జత 2629 అడుగులు, మూడో బహుమతిని నరసరావుపేట మండల ఇస్సపాలెం గ్రామానికి చెందిన జెల్లి నాగేశ్వరరావు ఎడ్ల జత 2508 అడుగులు దూరం లాగాయి. నాలుగో బహుమతిని బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పూసపాడు గ్రామానికి చెందిన సూరి బ్రదర్స్ జత, ఐదో స్థానంలో బాపట్ల జిల్లా మార్టూరు మండలం నాగరాజుపల్లి గ్రామానికి చెందిన తాతా హర్షవర్ధన్, ధనుష్ జత, ఆరో బహుమతి కృష్ణాజిల్లా నాగాయలంక మండలం బాహుదేవరపల్లికి చెందిన ఏఎస్ఆర్ మెమోరియల్ అద్దంకి దిలీప్‌నాయుడు, రాహుల్‌నాయుడు జత, ఏడో బహుమతి సత్తెనపల్లి మండలం కంటెపూడి గ్రామానికి చెందిన మున్నంగి వీరగోపాలరెడ్డి ఎడ్ల జతలు సాధించాయి. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ ఆరుపళ్ల విభాగంలో, సాయంత్రం నుంచి న్యూకేటగిరి విభాగంలో పోటీలు జరగనున్నాయి.



బండ లాగుడులో పాల్గొన్న మాదల గ్రామ ఎడ్లు

వైభవంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం

- పోటెత్తిన భక్తులు
- స్వామిని దర్శించుకున్న ప్రముఖులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మంగళగిరి (తాడేపల్లి రూరల్): మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెదవడ్లపూడిలో గల భగవాన్ శ్రీ సత్య షిర్డీ సాయిబాబా మందిర 19వ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. బాబాను దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఉదయం స్వామికి క్షీరాభిషేకం నిర్వహించారు. చిన్నపిల్లలకు, పెద్దలకు వినోదాన్ని అందించే ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు రాజకీయ పార్టీల నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, గంజి చిరంజీవి, నందం అబద్ధయ్య, మాజీ శాసనసభ్యులు మల్లాది విష్ణులతో పాటు రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి సిసోడియా, బి.ఎస్.ఎస్.ప్రసాద్, ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ జనరల్ సెక్రటరి విద్యాసాగర్, ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీరెడ్డి, సిద్ధార్థ అకాడమి చైర్మన్ రాజయ్య, అంకబాబు, సినీ నిర్మాత ఆదిశేషగిరిరావు, చీకోటి ప్రవీణ్ స్వామివారి ఆశీస్సులను అందుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం ఉత్సవాలను పర్యవేక్షించారు. భక్తులకు రామినేని ఫౌండేషన్ చైర్మన్, ధర్మ ప్రచారక్ ఆధ్వర్యంలో అన్నదానం చేసినట్లు నాగభూషణం తెలిపారు. హాజరైన ప్రముఖులకు శాలువాతో సత్కరించి, సాయిబాబా చిత్రపటాన్ని బహూకరించినట్లు ఆయన చెప్పారు.



శైవ క్షేత్రం పీఠాధిపతి శివస్వామికి సాయిబాబా చిత్రపటాన్ని అందజేస్తున్న చైర్మన్ పాతూరి

తాళం వేసిఉన్న ఇంట్లో చోరీ

- రూ.4లక్షల విలువైన ఆభరణాలు, రూ.1.50లక్షల నగదు తస్కరణ
- నూజెండ్లలో పట్టపగలే ఘటన

నూజెండ్ల(శావల్యాపురం): నూజెండ్ల గ్రామం బీసీ కాలనీలో పట్టపగలే నివాస గృహానికి వేసిన తాళం కోసి రూ.4.లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు చోరీ చేసిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చామర్తి ఏడుకొండలు రోజువారీ పనుల్లో భాగంగా ఆటో బాడుగకు వెళ్ళగా భార్య మిరపకోత పనులకు పొలానికి వెళ్లింది. ఇద్దరు పిల్లలు స్కూలుకు వెళ్ళారు. ఇది గమనించిన ఆగంతకులు ఇంటి తాళం కోసి, ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న రూ.4లక్షల బంగారపు గొలుసు, మాటీలు, వెండి పట్టీలు, రూ.1.50లక్షల నగదు చోరీ చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు గుర్తించారు. బీరువాలోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా వేశారు. మిరపకోత పనులు సీజను కావటం చేత ఇళ్లల్లో ఎవరు ఉండరని గమనించిన ఆగంతకులు చోరీలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ కృష్ణారావు సిబ్బందితో పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చోరీ జరిగిన బీరువాను పరిశీలిస్తున్న ఎస్ఐ బీవీ కృష్ణారావు

నిద్రలోనే మృత్యుఒడికి..

గుండెపోటుతో మృతిచెందిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్



మృతుడు దావల చినమూర్తయ్య(ఫైల్)

యద్దపాడు: అంతర్గత భద్రతా దళంలో పనిచేసే కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. యడ్లపాడు మండలం సొలస ఎస్సీకాలనీకి చెందిన దావల వెంకటేశ్వర్లు, గోవిందమ్మ దంపతుల ఇద్దరి సంతానంలో ఒక్కగానొక్క కుమారుడు చిన మూర్తయ్య(40) 2006లో సీఆర్‌పీఎఫ్(సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్) విభాగంలో కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరాడు. చిన మూర్తయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం ఒడిశా ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ ఇటీవల సెలవులపై వేలూరు వచ్చి భార్య, పిల్లలతో గడిపాడు. వారం కిందట తల్లిదండ్రుల్ని చూసేందుకు స్వగ్రామమైన సొలసకు వచ్చాడు. తిరిగి విధులకు వెళ్లాలనుకునే క్రమంలో కొద్దిపాటి అనారోగ్యానికి గురయ్యాడు. స్థానికంగా ఉన్న గ్రామీణ వైద్యుల వద్ద చికిత్స పొందాడు. ఈ నేపథ్యంలో విధులకు హాజరవ్వాలని సోమవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకుని, టిఫిన్ చేశాడు. కాస్తంగా నీరసంగా ఉండటంతో విశ్రాంతి కోసం నిద్రించాడు. అంతే నిద్రలోనే చిన మూర్తయ్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న భార్య, పిల్లలు సొలసకు తరలివచ్చారు. మంగళవారం మూర్తయ్య అంత్యక్రియలు స్థానికంగానే జరగనున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కానుకమాత తేరోత్సవం

రెంటచింతల: కానుకమాత చర్చి వజ్రోత్సవం పురస్కరించుకుని ఆదివారం రాత్రి 11.30 నుంచి సోమవారం ఉదయం 8.30 గంటల వరకు గ్రామపురవీధులలో కథోలికులు భక్తిశ్రద్ధలతో కానుకమాత తేరోత్సవాన్ని నిర్వహించారు. విద్యుత్ తోరణాలతో ప్రత్యేకంగా అలంకరించిన తేరుపై తిరుకుటుంబ విగ్రహంతో కానుకమాత చర్చినుంచి బ్రహ్మయ్య బావిసెంటర్, ఉట్లస్తంబాల సెంటర్, తిరుహృదయ మందిరం, లూర్దుమాత మందిరం మీదగా సుమారు 9 గంటల పాటు మేళతాళాలతో భారీగా బాణసంచా కాలుస్తూ ఊరేగించారు. గ్రామంలో ఆధ్యాత్మిక భావన ఉట్టిపడేలా గాయక బృందం భక్తి గీతాలను ఆలపించారు. ముందుగా కానుకమాత చర్చి ఆవరణలో సుమారు గంటన్నర సేపు కాల్చిన పలు రకాల నూతన బాణసంచా వేలాదిమంది భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విచారణ గురువులు రెవ.ఫాదర్ ఏరువ లూర్దుమరెడ్డి, సహాయ గురువులు అగస్టీన్ నేతృత్వంలో కన్యాస్త్రీలు, పెద్ద సంఖ్యలో భక్తులు, చర్చిపెద్దలు ఈ తేరోత్సవంలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా ఎస్ఐ సీహెచ్ నాగార్జున పెద్ద సంఖ్యలో పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన తేరుపై తిరుకుటుంబ విగ్రహాన్ని ఊరేగిస్తున్న కథోలికులు